# తొలి పొద్దు కల

'ఏరా పెద్దోడా... నీకేరా సెప్పేదీ ! పొద్దు పొడిచే యాల మెలకువగా ఉండబోక! కావాలంటే దుప్పటి తన్నేసి తొంగుంటే అదే నిద్ర పట్టుద్ది. ఆ దేవత నీమీద వాలేసిందంటే నిద్ర మైకం కమ్మేస్తాది. తొలిపొద్దుకల వచ్చేస్తాది !! చిన్నప్పట్నించీ కళ్ళు మెలేసి లేవక ముందే అవ్వ అందుకొనేది.

'ఛీ మొదలెట్టినాది ! లేచి నారుమడికి వడ్లు నాన బెట్టాల... పొలం పోరా నాయనా అనక దుప్పటి తన్నమంటాదేంటి. డెబ్భైఏళ్ల అవ్వ... కళ్లూ వళ్లూ కుంచించుకు పోయిన అవ్వ. కర్ర సాయం కూడా లేక తూలి పట్టుతప్పుతున్నా తన మాటలు, నామీద రుద్దాలనుకుంటుంటే నాకు చాల సిరాకు.

'ఎండ బారెక్కకని సెప్పలేదురా అబ్బీ ! తొలిపొద్దులో కల పండినాదంటే బ్రతుకు పండినట్టే !"

'చాల్లేయే... మొన్నటికి మొన్న మూడెకరాల మడిపొలం నెర్రలు తీసేసినాది. బీటల సందుల్లోంచి మండ్రకప్పలు, జెర్రులు తెగ పాకు తున్నాయి. తొలకరి సినుకు ఎప్పుడు కురుస్తాదా, కప్పల బెకబెకలు ఎప్పుడింటానా అని కొట్టుకు సత్తన్నాను. ఇక నిద్రాడమంటే ఎట్టా ఆడుద్ది సెప్పు! అయినా కాసంత సూసుకు కుయ్యాల !!' అన్నాను ఒకింత వ్యంగ్యాన్ని మిళితం జేసి.

'సర్లేరా ! ఎనకడికి మీ అయ్య కేరేజీలు మోసేవాడు. ఆడికీ ఈడికీ కూడు సంచీలు మోసి రావడమే గాని తిండానికి కాసింత కూటిని

పట్టుకోలేక పోయాడు'.

'.............'

'సందికాడొచ్చిన కల సావును మోసుకొస్తాదంట. తొలిపొద్దు కల పైకిలాగి పడేస్తాదంట!'

'కలొస్తాదంటూ తొంగుంటే ఎట్టాగే, ఎండ చురుక్కు తగిలినాదంటే పైరు కాడి పురుగు ఎగిరిపోతాది. మధ్యాహ్నం దాటి మారుగాలి తిరిగి వాతావరణం సల్లబడి నాదంటే గింజలకని పసిరిపురుగు గిజగిజ లాడుతుంది. సురుక్కు మనకుండా నీడ పాటున గచ్చకాయ రంగు పురుగు మందు పిచ్చికారీ సేస్తేనే కాపు సల్లగా వుండేది. ఎండవాటం లేకుండా సూస్కోవాలి!' చెప్పి చూశాను.

'యానాదే.... రత్తం సల్లబడినా అనుభవం సల్లబడలేదురా! అవ్వ సెప్పిందంటే సద్దన్నం దొరికిందన్న మాటే!!' పళ్లూడిన గొంతులో వస్తున్న ఆవలింతను సీర సెరగుతో నొక్కి పెడుతూ అంది.

అసలు ముసల్ది నామాట వింటేనా ! కన్నదానికి కన్నదయిపోయింది ఇంకేం సేస్తాను. అది సెప్పినట్టు ముసుగేస్తూనే ఉన్నాను.

'ఏరా యానాదే ! రొయ్యల్ని డెలివరీ ఇచ్చేది లేదా !! కమీషను ఏజెంటు కేషు డౌన్ అంటున్నాడు. వేగిను తెచ్చేసి సెరువు ముందు పెట్టేసినాడు. యలమంద, బోడప్ప ఈనాటి దిగుమతిని నెట్టి పడేసినారు. నీదే ఆలస్యం. లేదంటావా ప్రక్క సెరువుకు పోతాను'. రెడ్డప్ప మాటలు నాలోపడి యావను రగిలించాయి. అవును కేషు డౌన్ బేరం ఎప్పటికో గాని ఎరుక గాదు. యలమంద, మోడప్ప మీసాల రొయ్యి పెట్టెల్ని ఎత్తేసినారంటే.... తెలుసుకుంటే నాలో గుబులు మోతాదు పెరిగినాది.

చటుక్కున పంచెను పైకి ఎగగట్టి మూడెకరాల ఏకమడి రొయ్యిల సేనుకు పరుగు లంకిచ్చుకున్నాను.

పెద్ద కరణం గారబ్బాయి తెగనమ్మి పడేసి పట్నానికి సెక్కేత్తాంటే మా అయ్య ఆ మూడు ఎకరాల మాగాణీని పట్టేశాడు. కానీ ఏంసేస్తుం మేఘం మెరవక.... వర్షం కురవక బీటలు తీసిన భూమి పగుళ్లు మా బ్రతుకులకి బీటలు తీసి పడేసింది. అందరిలాగే రైతాంగ సంక్షోభం మాకూ తప్పలేదు. బలవంతపు సావులు రోజు రోజుకీ పెరిగిపోతున్నాయి. సర్కారోళ్ళు ప్యాకేజీలంటూ, తాత్కాలిక ఉపశమనాలంటూ కాలం వెళ్ళబుచ్చుతూ పడుతున్న ఓట్ల పాట్లు తెలిసినా బయటకు సర్దుకోవడం తప్పడం లేదు. దాంతో చిన్నకారు, సన్నకారు రైతు కనుమరుగయ్యే ప్రమాదంలో చిక్కుకున్నాడు.

నాకు పెద్దగా సదువు లేకపోయినా పేపరు పరిజ్ఞానం ఆలోచనల్ని రగిలిస్తానే ఉంది. నాయన సంపాదించి పోయిన మూడెకరాల మాగాణి నన్ను వెక్కిరిస్తానే ఉంది. క్రమంగా పెట్టుబడికి సొమ్ములు కొదవై బ్యాంకు అప్పులు తీర్చలేక నిండా మునిగిపోతున్నా పగుళ్లు తీసిన పంటభూమిని నా కన్నీళ్లతోనైనా తడుపుదామని ప్రయత్నించే వాడిని. కన్నీరు కూడా నిండుకొని కనుకొలను ఎండి పోనాది.

ఆరోజు ఉదయం... పొద్దుపొడవే నేదు. రాత్రి కంటికి కునుకు నేదు. నెమ్మదిగా మాగన్ను పట్టినాది. ఆదమరిసిన నిద్ర ఒళ్ళు తెలీయనేదు. అలసటకి నిద్ర విలువ తెలిసినాది. కటిక నేలమీద పడుకొని రగ్గు కప్పేశాను. ఇక నిద్రే నిద్ర.

ఓ కల నన్ను వెంటాడతాంది. లచ్చిందేవి నన్ను కరుణించినాది. వర్షాన్ని కురిపిస్తాంది. భోరున పడే సినుకు బంగారంలా మెరుస్తాంది. నా ఒడినిండా బంగారు కాసులు. నా ఆలి ఒంటి నిండా బంగారంతో నిండి పోనాది.

ఒకప్పుడు సిరుగుల సీర ఒంటిని కప్పి పుచ్చనప్పుడు నన్ను సూసి సిగ్గుపడేది.

'పోన్లేవే ! సిరుగుల సందుల్లోంచి నీ అందాల్ని సూసేది నీ మొగుడే కదా !! అని నవ్వేవాణ్ణి.

' అలా సూడమోకయ్యా !' అంటూ బుచ్చమ్మ సిరుగులకు సేతులు అడ్డం పెట్టేది. అలాంటిది సిలకంచు పట్టు సీరలో ఇప్పుడు మెరిసిపోతాంది. మురిసిపోతాంది.

సటుక్కున మెలకువ వస్తాదోనని భయపడ్డాను. లచ్చిందేవి కరుణించినాది. బంగారు వర్షం కురిసింది. నేను ఇప్పుడు వడ్డికాసులోరిలా మెరిసి పోతన్నాను.

'సూడు యానాదా ! నీకు వర్షం ఇచ్చేసినాను. ఇక నీ గుడిసె నిండా బంగారపు సుద్దలే. నీ మూడెకరాలు ముప్పై ఎకరాలవుద్ది. సటుక్కున మెలకువ వచ్చినాది. అవ్వ మాటలు గుర్తుకొచ్చినాయి. ఆ ముసలిదాన్ని అప్పట్లో ఇసుక్కునే వాడిని కానీ దాని మాటలు నిజం అవుతాయని నాకు తెల్సు. నాలో ఆశ మొదలైంది. ఆనిమిషం నుండి.

ఒక్కసారి వర్షాలు కురవడం మొదలయ్యాయి. పొలంలోని పగుళ్ళలోకి నీరు చొరబడి పూడిపోనాయి. మట్టి ముద్దయింది. మాగాణి మాణిక్యం నంటూ పులకిస్తాంది. మట్టి వాసన కమ్మగా అన్పిస్తాంది. నాకే కాదు మా రెడ్డప్ప నాయుడు పాలేనికి సంతోషమే సంతోషం. కప్పల బెకబెకలు ఇని ఎన్నాళ్ళయినాదో... శాన ఆనందంగా ఉన్నాది.

'సూడు యానాదా ! ఇన్నాళ్ళూ వర్షం లేదు, వరిలేదు. పెట్టుబడే గాని సావిట్లోని గొడ్డుకి ఎండుగడ్డి కూడా మిగలడం నేదు. ఇప్పుడు సూడు సినుకు తల్లి కరుణించినాది. ఈ వరి సెరుకులు నీ నోట్లో రెండేళ్ళు పెట్టనిస్తాయి గాని ఐదేళ్ళు పెట్టనీయడం నేదు. అదే

ఈ సాగు సూడు. ధైర్యం సేశావంటే ఐదు ఏళ్ళు కాదు ఐదువందల ఏళ్ళు నోట్లోకి పోతాయి' తెచ్చిన కాగితాలు సూపిస్తూ అన్నాడు రెడ్డప్ప.

సూశాను రొయ్యలు, రొయ్యల సెరువు బొమ్మలు రంగురంగుల్లో మెరుస్తున్నాయి.

'రొయ్యల పంట గురించి పేపర్లో శానాసార్లు సదివాను. కానీ నీరు కావల గదా రెడ్డప్పా!'

'ఎండిన గుంటలు నిండినాయి కదా! ఇక నిలుస్తాది ఫో!!' అన్నాడు.

రెడ్డప్ప మా రెడ్డప్పనాయుడు పాలేనికి తిరుగులేని బ్రోకరు. పొలాలు అమ్మకాలు, కొనుగోళ్లు మీదేంటి, వ్యవసాయ ఉత్తత్తుల మీదేంటి ఎక్కడైనా సరే రెడ్డప్ప సేయి పడందే లచ్చింతల్లి సేతిలో పడదు. మా ఊరోళ్ళకి ఓ గుడ్డి నమ్మకం.

ధాన్యం కళ్ళాంలో తూసడనికి కాటా ఏసుకు దిగిపోయేవాడు. అటువంటోడు ఇయాల రొయ్యిల బిజినెస్ మీద పడ్డాడు. ఆడికి డబ్బంటే ఇలువేమిటో... ఒళ్ళు పులవకుండా ఎలా సంపాయించాలో బాగా తెల్సు.

రెడ్డప్ప మాటలు నాకు బాగా బుర్రకెక్కాయి. లచ్చిందేవి నా గుడిసెలో ఇక కురవడమే తరువాయి. ఈ వ్యవసాయం అక్కరకు రాదని అర్ధమై పోనాది.

'సర్లేనయ్యా ! సినుకు పడింది గదా అని ఇలా తిండి గింజల్ని పారనూకితే కడుపు నిండేది ఎలా సెప్పు! ఎల్లకాలం ఆ మీసాల రొయ్యల్ని బండకేసి అరగదీసి మింగలేం గదా!!' ఓ మారు బుచ్చమ్మ సతాయించడం మొదలు పెట్టినాది.

'సూడు బుచ్చా ! నువ్వు కుప్ప నూర్చి కళ్ళాపులో బిగించిన గింజలకి గిట్టుబాటు ధర దొరుకుతాందా సెప్పు ? నేను నీకు పది రూకలు ఎక్కువ ముట్టజెబుదామన్నా పైనున్న మిల్లోళ్ళు ఊరకుంటన్నారా సెప్పు?

ఈ రొయ్యి సెరువు నీ ఇంటికాడ రొఖ్ఖాన్ని నింపుతాది. నా మాట నమ్ము!!' అన్నాడు రెడ్డప్ప.

' మాగాణిని దున్ని పడేస్తే ఈ పాలె కాపులు పొలంమీద బతికే కూలీనాలీ బక్కోళ్ళ సంగతేందంట?' బుచ్చమ్మ గుండెల్లోని నిజాయితీ రెడ్డప్పకి కొంత ఇబ్బంది కల్గిస్తాంది.

ఇక నాకయితే పెళ్ళాం మాట నచ్చింది కానీ పైకం పరమాత్మ అయి కూర్చున్నాది.

'అది కాది బుచ్చే ! రొయ్యిలు పరాయి రాష్ట్రాలకి, దేశాలకి ఎక్స్‌పోర్ట్ అవుతున్నాయి. ధైర్యం సేస్తే నీలాంటి ఎందరో బక్క రైతుల బతుకు మారిపోతాది!!' అన్నాడు రెడ్డప్ప.

క్రమంగా రెడ్డప్ప నాయుడు పాలెంలోని పంటపొలాలు రొయ్యల కయ్యలుగా

మారిపోయాయి. ఆకాశంలోని మేఘాలు ఇన్నాళ్ళూ పీల్చి ఆవిరి సేసేసిన నీటిని తమలో ఇంక ఇముడ్చుకోవడం వల్ల కాదన్నట్లు బాగా ఉబ్బి... ఆ ఉబ్బు తగ్గించుకోడానికి కురిసేస్తున్నాయి. రెడ్డప్ప పుణ్యమా అంటూ ఊరిలోని మొత్తం పంట పొలాలు రొయ్యల కుంటలుగా మారిపోతన్నాయి.

రోజూ పట్నం నుండి వేగినులు వచ్చి పడతన్నాయి. పాలే కాపులకి, కూలీ నాలీ సేసుకు బతికే బక్కపీనుగలకి పనులు తగ్గిపోనాయి. మొదట్లో బాగానే గగ్గోలు పెట్టినారు. సివరకు సేతులుడికి సతికిలబడినారు. ప్రభుత్వం కూడా మీసాల రొయ్యిల్ని సూసి తన మీసం మెలేయడం మానేసింది. ఇప్పుడు నాకు కారు, మూడంతస్థుల సొంత కొంప. వడ్డికాసులోడిలా నేను, పద్మావతమ్మలా బుచ్చమ్మ, డబ్బు బంగారంతో మెరిసిపోతున్నాము.

నా బతుకు నాకు ఓ కలగాను... కలలాంటి నిజంగాను ఉన్నాది.

అవ్వ పలుకులు బాగా పడ్డొచ్చినాయ్. ఎలాగైనా ముసలిదాని మాట ముతక అయిన పొద్దు పూసినప్పటి కల నిజం అయి తీరతాంది. అప్పటి నుండి కావాలని కలలు కంటూనే ఉన్నాను.

'సూదయ్య రొయ్య కయ్యలొచ్చి పంట పొలాల్ని మింగి పడేసినాయి. తిండికి గింజలు దొరక్క గిజగిజ లాడతన్నాము. సివరికి డబ్బోసి కొనుక్కోవాల్సి వస్తన్నాది. ఈ ఖర్మ ఏంటి సెప్పు. సంపాదించినది సాలుగాని ఇక సెరువుల్ని తవ్వి పడేసి పరినాట్లు పడేయి' అన్నాది బుచ్చమ్మ.

'పిచ్చిదిలా ఉన్నాది' ఓ గట్టి నవ్వు నవ్వాను. అదే విషయం సెప్పాను రెడ్డప్పతో.

'సాల్లే బుచ్చమ్మా ! సాలుకి నీ పాతిక కాటాల మీద ఎంత పైకం తీస్తావు సెప్పు. పెట్టుబుడులు పోను ఎంత మిగులుత్తావు. అదే అరటన్ను జాతి రొయ్యల్ని ఎక్స్‌పోర్టు సేశావంటే లక్షలంటే లచ్చలే నీకు!!' అందుకున్నాడు రెడ్డప్ప.

'................'

'అయినా మన జిల్లాలో అన్నీ రొయ్యి పొలాలే ! నష్టమేమొచ్చినాది సెప్పు. తింటానికి కర్నూలు బియ్యమున్నాయి. అక్కడ నిండుకుంటే అస్సాం బియ్యం వస్తాయి. అక్కడా కాదంటే చైనా బియ్యం వచ్చి పడతాయి. నీకు తెలుసో లేదో నీవు పండించిన నూకల కన్నా సైనా బియ్యం సీపు' రెడ్డప్ప తెలివితేటలు బుచ్చమ్మ మీద బాగానే పన్జేసినాయి. ఆనాట్నుండి నన్ను సతాయించడం మానుకొంది.

రెడ్డప్ప నాయుడు పాపం పెరిగిపోతాంది. ఇప్పుడు కులవృత్తులు లేవు. కుండలు సేసే కుమ్మరోడు లేదు. మగ్గం నేసే సాలోడు లేదు. కత్తులు పట్టే కమ్మరోడు లేదు. వడ్రంగోడు

అయితే సరేసరి. సివరికి గెడ్డం గీయడానికి కూడా ఎవరూ మిగల్లేదు. ఎవడి గెడ్డం ఆడు గీసుకునే మిషన్లు వచ్చి పడ్డాయి. తరతరాలుగా నమ్ముకొని బ్రతికిన సాంప్రదాయ వృత్తులన్నీ మాయమైనాయి. దేశానికి వెన్నెముక అని గొప్పలు సెప్పే రైతు పదానికి అర్థం మారిపోనాది నాలాంటోడు ఎవడో ఒకడు బయట పడ్డాడు గాని శానమంది వెన్నెముకలు విరిగిపోనాయి.

కూలీ నాలీ పనోళ్ళు పొట్ట సేత్తో పట్టుకొని పోనారు. విసారిస్తే పట్నం పారిపోయి రోగాల బారిన పడి అయిన కాడికి రెక్కల్ని అమ్మేసుకొని బతుకుతున్నారట. సూస్తాంటే నా ఇనపెట్టెలోని డబ్బు కాంతి ముందు ఆ సీకటి కనబడడం మానేసి శానా ఏళ్ళు అయిపోనాది.

రెడ్డప్ప నిజంగా ఉండవల్సినోడే ! మమ్మల్ని లక్షాధికారుల్ని సేసి ఆడు కోటీశ్వరుండై పోనాడు. ఇక్కణ్ణుంచి రొయ్యిల ఎక్స్‌పోర్టే గాదు. చైనా బియ్యం దిగుమతి కూడా మొదలెట్టినాడు.

' ఈ బియ్యం సూడరా ! కర్నూలు నూకలు, అస్సాం మొలకలు మన కడుపుకి సరిపడవు కాని సైనా దేశపు బియ్యం పొడవెక్కువ, రేటు తక్కువ. ఎంత రుచిగా ఉంటాందో బుచ్చమ్మ సేత వండించి సూడు'.

సూశాను.... నాతో బాటు రెడ్డప్ప మాట మీద నమ్మకం ఉన్న ఊరు ఊరంతా వండి సూసింది. ఆడు సెప్పినట్టు నిజంగానే ఖర్చు తక్కువ బియ్యం. అందుకేనేమో కర్నూలు, అస్సాం బియ్యం మూటలు ఈ మధ్య రావడం మానుకున్నాయి.

పొద్దుటేళ కలలకోసం ఎదురు సూస్తూనే ఉన్నాను. అడపాదడపా అప్పుడప్పుడు కంటూనే ఉన్నాను.

మళ్లీ లచ్చమ్మతల్లి కరుణించినాది. కలలో పెత్యక్షమయినాది. ఇప్పటికే కురిసిన బంగారు వానలో తడిసి ముద్దయిపోయి ఉన్నాను. అయినా ఏదో ఆశతో ఉన్నాను.

అంతలోనే ఆ తల్లి ఏసిన ఎదురు ప్రశ్న నన్ను నిలేసినాది. 'నువ్వు ఆవురావురు మంటూ మెక్కుతున్న అరంగుళం సైజు చైనా మెతుకులు నీకు ఇక దొరకవు. ఆళ్ళు కావాలనే నీకు అడ్డేసి పడేశారు. ఇక నీ ఏడుపు నీది.

రొయ్యను తింటావో....రొయ్య సెరువులో దూకుతావో...!'

చటుక్కున మెలకువ వచ్చినాది నాకు.

ఓ భయం తాలూకు సందేహం నాలో మొదటి సారిగా మొదలైనాది.

అన్ని సార్లూ నిజం సేసిన జాము పొద్దుకల నిజం కాకూడదనిపిస్తాంది!

'యానాదా ! సిక్కొచ్చి పడినాదిరా.... వందలు ఎక్కువిస్తావన్నా ఆ దేశపోళ్ళు సరుకు పంపమని మొండికేస్తన్నారంట....' పేపరు సూపిస్తూ అన్నాడు రెడ్డప్ప.

నిన్నటి కల ముందుకొచ్చి ప్రశ్నగా నిలుస్తాంది.

నాలో ఓ సందేహం... ఆత్మావలోకనం. 'ఎందరో అసంఘటిత కార్మికులకు అనాలోచనంగా అన్యాయం సేసినందుకేమో వ్యవస్థకు ఈ దురవస్థ. కులవృత్తుల్ని నరికి పారేసినందుకే నేమో ఈ సమస్య' పేపర్లు మహా సక్కగా రాసి పడేసినాయి.

సెమటలు పడుతున్నాయి నాకు. బుచ్చమ్మ నాకన్నా తెలివైంది. కనీసం దాని మాటనైనా విని ఉండాల్సింది!

నీటితో నిండుగా కన్పిస్తూన్న సెరువులు నన్ను వెక్కిరిస్తున్నట్లుంది.

ఓ ఉన్మత్త భావనతో కళ్ళు మూసుకున్నాను.

ఓ కలలాంటి భావన. అంతా చీకటిగా ఉన్నాది.

ఏమీ కన్పించడం నేదు. కటిక సీకట్లో ఏదో కూలిపోతూన్న సప్పుడు విన్పిస్తాంది. శాన భయంగా ఉంది నాకు.

ఆ కటిక సీకటిలో ఎలుతురు నింపడానికి ఎవరో నడిచి వస్తన్నాడు. ఎఱ్ఱగా పొడుగ్గా ఉన్నాడు. ఆడి సేతిలోని సిరుదివ్వె కాంతుల్ని వెదజల్లుతోంది. సునిశితంగా పరికించి మరీ సూశాను. ఎఱ్ఱగండు సీమలా అగుపిస్తున్నాడు.

ఆడి నోటమ్మట ఏదో పరాయిదేశపు బాష వినిపిస్తాంది. సీకటిని పారదోలు తున్నాడు.

ఎఱ్ఱగా.... మహా ఎఱ్ఱగా అంతా తానై ఎలుతురుతో ఆ సీకటిని పూర్తిగా ఆక్రమిస్తున్నాడు.

సటుక్కున మేలుకున్నాను.

మొదటిసారిగా ఆ తొలిపొద్దుకల నిజం కాకూడదనిపిస్తాంది నాకు. ✿

**(రమణీయ కథల సంపుటిలో ప్రచురితం)**